ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023



అల్లూరి సీతారామరాజు

'నాడు - నేడు' పనులపై అవగాహన



మాట్లాడుతున్న సిడిపిఒ సంతోషికుమారి

ప్రజాశక్తి -అనంతగిరి : నాడు నేడు నిధులతో అంగన్వాడీ భవనాలకు ఏ విధంగా మరమ్మతు పనులు చేపట్టాలో అనే దానిపై తల్లుల కమిటీ ఏర్పాటు చేసి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించినట్లు సిడిపిఒ సంతోషి కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వం నాడు నేడు పథకం రెండో విడతలో మండలంలోని64 అంగన్వాడీ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే పనులు ఏ విధంగా చేపట్టాలో అనేదానిపై అవగాహన శిక్షణ కల్పించామన్నారు. సచివాలయ ఇంజనీరింగ్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ మ్యాజిక్ షో

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఘనంగా జీవ పరిణామ దినోత్సవం



సైన్స్ మ్యాజిక్ షో నిర్వహిస్తున్న జెవివి ప్రతినిధి

ప్రజాశక్తి -పాడేరు: దేశవ్యాప్త శాస్త్రీయ దృక్పథ ప్రచారోద్యమంలో భాగంగా జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, జి.మాడుగుల మండలాల్లో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో జీవపరిణామ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ మ్యాజిక్ షో విద్యార్థుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం 51(ఎ)(హెచ్) అధికరణం ప్రకారం ప్రజలందరూ శాస్త్రీయ దృక్పథం కలిగియుండాలన్నారు, విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకొని మూఢనమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధానకార్యదర్శి వై పాండయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ చిల్లంగి, పోడి, నాటు మందులు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. 1859 నవంబరు 24న డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ప్రకటించినందున ఆ రోజున జీవపరిణామ దినోత్సవం జరుపుకుంటారన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే కార్యక్రమాలు జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అప్పలరాం, పాడేరు ఎస్ఐ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ రమాదేవి, ధనలక్ష్మి, గణేష్, ప్రభాకర్, వేణుప్రసాద్ శ్రీనివాసరావు, పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధిపై ముగిసిన శిక్షణ



శిక్షణకు హాజరైన గణిత ఉపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట : మండలంలోని బాకూరు, మెరకచింత స్కూల్ కాంప్లెక్స్‌ల .పరిధిలోని ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు అభ్యసనాభివృద్ధి (ఎల్‌ఇపి)పై రెండు రోజుల శిక్షణ ముగిసింది. స్థానిక జెడ్‌పి బాలురు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణలో 6.7.8 తరగతుల విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో విద్యాబోధన, సులభంగా గణిత సమస్యలను పరిష్కరించడం, ఇతరంత్రా అంశాలపై శిక్షణనిచ్చారు. మండలంలోని ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలల్లో గణితం సబ్జెక్టు బోధిస్తున్న 20మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ఎంఇఒలు సింహాచలంనాయుడు, ప్రతిభ నాయుడు తోపాటు గణితం ఉపాధ్యాయులు కోటిబాబు, చిన్నయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న రఘునాథ్, వైసిపి నేతలు

ప్రజాశక్తి- అరకులోయ : కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన పద్మాపురం గ్రామానికి చెందిన స్వాబి సోన్ను (35) అనే గిరిజనుడి కుటుంబానికి వైసిపి సీనియర్ నేత, పెదలబుడు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ సమడ్డి రఘునాథ్ ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో మూడవ రోజు పెద్ద కర్మ కొరకు, శనివారం పద్మపురం సర్పంచ్ ప్రతినిధి పెట్టేలి శుక్ర, మాజీ వార్డ్ సభ్యుడుపొండోయి. సన్యాసి, వార్డ్ మెంబర్ జన్ని అర్జున్, గోవింద్, వంతల అద్దు, జన్ని స్వామిలతో కలిసి అరకు నియోజక వైసిపి సీనియర్ నేత అయిన సమర్డి. రఘునాథ్ పద్మాపురం సర్పంచ్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి మృతుడి తండ్రి, స్వాభి సుంద్రకు రూ.11వేల ఆర్థిక సహాయం ఇతర దినుసులు అందజేశారు.

పాడైన కాజ్‌వేపై ప్రయాణం ఎలా?

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఉద్యోగులు



మత్స్య గెడ్డపై ప్రమాదకరంగా ఉన్న కాజ్ వే

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మత్స్య గెడ్డ కాజ్ వే దెబ్బ తినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాడేరు మండలం బొక్కెళ్లు నుంచి రాయిగెడ్డకు వెళ్లే మత్స్య గెడ్డ కాజ్ వే ప్రమాదకరంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ కాజ్‌వే మీదుగా గొండెలి, కించూరు, ఇరడాపల్లి పంచాయతీల్లోని సుమారు 40 గ్రామాల ప్రజలతోపాటు ఈ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సచివాలయ, ఇతర ఉద్యోగులు, పలు ప్రాంతాల ప్రజలు ఈ మత్స్య గెడ్డ కాజ్ వే వినియోగిస్తారు. దీంతో ప్రతిరోజు ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, పెద్ద వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదకరంగా మారిన కాజ్ వేతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఈ రోడ్డు మీదుగానే తమ అవసరాల కోసం జిల్లా కేంద్రం పాడేరుతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. పాడైన కాజ్ వేతో నిత్యం నరకయాతన పడుతున్నారు. స్థానికులు, ప్రయాణికుల నుంచి కాజ్ వే బాగు చేయాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాడైన కాజ్ వేకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

నకిలీ ఎస్‌టి కులధ్రువీకరణల జారీపై

చర్యల్లో నిర్లక్ష్యమెందుకో..!

- రాజకీయ పార్టీలు, నేతల వైఖరి ప్రకటించాలి
- 30 గంటల నిరసన దీక్ష ముగింపులో

ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న మహేశ్వరరావు, బాలదేవ్, చిన్నారావు

ప్రజాశక్తి- అరకులోయ / రూరల్ : అరకులోయ మండలం పెదలబుడు, పద్మాపురం, సుంకరమెట్ట, చొంపి పంచాయతీల్లో ఇటీవల జారీ చేసిన నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన తహశీల్దార్‌పై చర్యల్లో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం చేపట్టిన 30గంటల నిరసన దీక్ష ముగిసింది. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి. బుజ్జిబాబు, జిల్లా నాయకులు సుందరమెట్ట సర్పంచ్ జి. చిన్నబాబు, పి.నానిబాబుల ఆధ్వర్యంలో నిరసన దీక్షలో పాల్గొన్న వారికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. మహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ దీక్షలకు పెదలబుడు-2 ఎంపిటిసి దురియా ఆనంద్‌కుమార్, సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, ఆదివాసీ సేన జిల్లా నాయకులు రాజు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, ఏజెన్సీలో కుల ధ్రువీకరణ పత్రాలపై జారీపై అనేక దఫాలుగా వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు చేస్తున్నా గిరిజన ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు కనీసం స్పందించకపోవడం అత్యంత దుర్మార్గమని, దీనిపై వారి వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పిట్టల, కార్తిక వంటి ఇంటి పేర్ల నకిలీ ఎస్టఇ కులధ్రువీకరణల జారీపై తగు ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా, బాధ్యుడైన అరకువేలి తహశీల్దార్‌పై చర్య తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఉదంతంలో ముఖ్యుడైన తహశీల్దార్ వేణుగోపాలరావు ను వదిలేసి కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం వెనుక స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలన్నారు.

సుంకరమెట్ట పంచాయతీ బంగ్లావలస గ్రామంలో కార్తిక అనే ఇంటి పేరు మీద నకిలీ ఎస్‌టి నూకదొర కులధ్రువీకరణ పత్రంపై ఎంఆర్ఐ, విఆర్ఒలతో విచారణ జరిపించడం హాస్యస్పదమన్నారు. పిట్టల రాంబాబు, పిట్టల ప్రసాద్, కొర్రా అకులా, కార్తిక రాజకిరణ్‌ల పేరిట జారీచేసిన కులధ్రువీకరణలపై పూర్తి ఆధారాలతో ఆదివాసీ గిరిజన సంఘం ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నకిలీ ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అరకులోయ తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని, తప్పుడు కులధ్రువీకరణలు పొందిన వారిపైనా అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చర్యల్లో నిర్లక్ష్యం చేస్తే జిల్లా, రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి. జోషి, కె.మగ్గన్న, టి.హరి, కె..జగన్నాథం, కె.సింహాచలం, కె.చిట్టిబాబు, కె.బొంజు, అమర్ సాయి అంజిరావు, శంకరరావు, చిన్నమ్మి, పుష్ప, భవానీ, జానకి, సుమిత్ర పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలి

డుంబ్రిగుడ: ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనేతరులకు నకిలీ ఎస్‌టి కుల ధ్రువపత్రాలు జారీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ డుంబ్రిగుడతోపాటు అరకు, అనంతగిరి ఇతర మండలాల్లో పెద్దఎత్తున గిరిజనేతరులకు నకిలీ ఎస్‌టి కులధ్రువీకరణలు జారీ చేస్తున్నారని, వీటితో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్‌తో పాటు పర్మినెంట్ ఉద్యోగాలను పొంది నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే దీనిపై ఉన్నతస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయకతప్పదని హెచ్చరించారు.

98మందికి సాగు హక్కు పట్టాల పంపిణీ




పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని పోడు భూముల సాగుదారులకు శాశ్వత సాగు హక్కు పట్టాలను పంపిణీ చేసి, సమస్యను పరిష్కరించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోనికించాయిపుట్టు సచివాలయ పరిధిలోని సరియాపుట్టు గ్రామానికి చెందిన 98మంది గిరిజన రైతులకు కొండపోడు శాశ్వత సాగుహక్కు పట్టాలు పంపిణీ చేశారు. కొండపోడు పట్టా పొందిన రైతులందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని, సూచించారు. పట్టా పొందిన భూముల్లో ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇచ్చి, సిల్వర్‌వోక్, కాఫీ, మిరియాలు వంటి వాణిజ్య పంటలు పండించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో తహశీల్దార్ నర్సమ్మ, ఎంఆర్.ఐ రవి, ఎంపిపి సీతమ్మ, వైసిపి నేతలు పాల్గొన్నారు.

కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-కూనవరం

కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ప్రతి పోలవరం నిర్వాసితుడికీ పూర్తిస్థాయిలో పరిహారం త్వరితగతిన అందాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు మండా దుర్గాప్రసాద్ ఇంటి వద్ద వాసం రాము అధ్యక్షతన శుక్రవారం జరిగిన విలీన నాలుగు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు కడుతున్న కాలనీల నిర్మాణం నత్తనడకన సాగుతుందని, నాసిరకంగా ఉందని ఆరోపించారు. గిరిజనేతరులకు గోకవరం. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పునరావాస కాలనీలు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరదలు వల్ల ముంపునకు గురైన ఇళ్లకు ఇస్తామన్న రూ.10వేలు తక్షణమే ఇవ్వాలన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్రం ఇస్తేనే ఆర్ అండ్ ఆర్ సాధ్యమవుతుందని చెప్పిన ముఖ్యమంత్రి, ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ప్రక్రియ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వర్షాభావ పరిస్థితుల వలన పోలవరం ముంపు మండలాల్లో వరి, మిర్చి పంటలు ప్రధానంగా దెబ్బతిన్నాయని, ఈ మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీనియర్ నాయకులు మండ దుర్గాప్రసాద్, డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు, నాయకులు కందుకూరి స్వర్ణ, లంబు శ్రీనివాసరావు, జుత్తుక సూర్యచంద్రరావు, గుంటుక కుసుమ రాణి, నాలుగు మండలాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలకు ఎందుకు వెనుకాడుతున్నారు?

సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామపంచాయతీల ద్వారా గ్రామసభలు పెట్టి అధికారులతో తెలియజేయాల్సి ఉండగా, గ్రామ సభలు పెట్టడానికి ఎందుకు వెనుకాడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య ప్రశ్నించారు. మండల కేంద్రంలోని మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వ పథకాలు గ్రామసభల ద్వారా ప్రచారం చేసే అర్హత స్థానిక గ్రామ సర్పంచులకు, పంచాయతీ అధికారులకు లేదా? అని ప్రశ్నించారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, సాగునీరు, వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాల్సి ఉండగా, ఆ పనులేవీ చేయడం లేదని మండిపడ్డారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువు సాగడం లేదన్నారు. పంచాయతీల్లో విద్యుత్ కనెక్షన్లు కట్ చేయటం ఏమాత్రమూ సమంజసం కాదన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతుకు పరిహారం ఇవ్వరా? ఈ సమస్యలేవీ కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలనుకుంటే పార్టీలకతీతంగా అధికార్ల ద్వారా చాటింపు వేసి రచ్చబండ దగ్గరకు ప్రజలను పిలిచి గ్రామపంచాయతీలో గ్రామసభలు ఏర్పాటు చేయాలని హితవుపలికారు. అలా కాకుండా వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ పార్టీ కార్యక్రమం అనుకుంటే సచివాలయ ఉద్యోగులను పిలవొద్దన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు, సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య



వర్షాభావం వల్ల దెబ్బతిన్న రాజ్‌మా పంటను పరిశీలిస్తున్న నాయకులు

జికె.వీధిని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొర్రా బాలయ్య, నాయకులు పాంగి బాబురావు, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు జికె.వీధి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తీవ్ర వర్షాభావం వల్ల వరి, మినప, రాజ్‌మా తదితర పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొంతమేరకు అక్కడక్కడ పండిన వరి పంట కోతలు కోసి పొలాల్లో ఉండగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పొలాల్లో వరి పంట తడిసిపోయి, ధాన్యం మొలకలు వచ్చి పూర్తిగా నాశనమైందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారులను పంపించి పంట నష్టాన్ని అంచనా వేసి గిరిజన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు



మాట్లాడుతున్న ఉమాదేవి

వాతావరణ పరిస్థితులను తెలుసుకుంటూ గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రైతులు వరి పంట కోతలకు తాత్కాలిక విరామం చేయాలని, కోసిన వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరి కుప్పలు తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పాలని సూచించారు. వర్షాలకు వరి ఫనలు తడిచిన సందర్భంలో లీటరు నీటిలో 5 శాతం ఉప్పును కలిపి పిచికారీ చేస్తే ధాన్యం రంగు మారకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.

ఒఎఫ్‌సి కేబుల్‌లో సాంకేతిక లోపాలు

రెండు రోజులు నిలిచిన బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు, దారకొండ పరిసర ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ ఒఎఫ్‌సి కేబుల్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో బిఎస్ఎన్ఎల్ సెల్, నెట్ సేవలు గురువారం ఉదయం నుండి, శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు గురయ్యారు. ఏపీ జెన్కో, ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. స్థానిక యూనియన్ బ్యాంకులో లావాదేవీలు ఆగిపోవడంతో ఖాతాదారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి ఒఎఫ్‌సి కేబుల్‌కు మరమ్మతులు చేయడంతో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి సెల్, నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

అల్లూరి విగ్రహ పునఃప్రతిష్ట కమిటీ కన్వీనర్‌గా వరలక్ష్మి

ప్రజాశక్తి -కొయ్యూరు

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొయ్యూరు మండలం కాకరపాడు సెంటర్‌లో తొలగించబడుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని అదే ఏరియాలో మరోచోట పున:ప్రతిష్ఠించేందుకు ఏర్పడిన కమిటీ కన్వీనర్‌గా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల వరలక్ష్మిని నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో అల్లూరి విగ్రహంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. సంఘం సభ్యులను సమన్వయం చేసుకొని రెండు విగ్రహాల ప్రతిష్టల కార్యక్రమానికి విజయవంతం చేయాలని వరలక్ష్మికి సూచించారు.

గిరిజన యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సీలేరు

మద్యానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన గిరిజన యువకుడు విషపూరిత మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి సీలేరులో చోటుచేసుకుంది. సీలేరు ఎస్ఐ రామకృష్ణ కథనం ప్రకారం... జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి టిఆర్‌సి క్యాంపునకు చెందిన కిలో మంగళ (19) చిన్నప్పటి నుండి మద్యానికి బానిసై నిత్యం మద్యం సేవిస్తూ ఉంటున్నారు. ఈ క్రమంలో మద్యం తాగడానికి కుటుంబ సభ్యులను డబ్బులు అడగ్గా వారు ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన మంగళ గురువారం సాయంత్రం తమ ఇంట్లోనే విష పూరిత మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మద్యం తాగిన మత్తులో ఉన్నాడని భావించి రాత్రి కుటుంబ సభ్యులు మంగళను లేపలేదు. శుక్రవారం ఉదయం చూసే సరికి మంగళ మృతి చెంది ఉన్నాడు. ఆయన తండ్రి గంగాధర్ ఫిర్యాదు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

నేడు అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు

పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో ఈనెల 25న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఎస్ఆర్ఎస్, నోట్‌కాం అటెండెన్స్, ఎంపీడీవో కౌంటర్ సైన్, టూర్ డెయిరీ, డ్రింకింగ్ వాటర్, బోర్ వెల్స్ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.


హాస్టల్ భవనాల పునాదులను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

అసంపూర్తి హాస్టల్ భవనాలను పూర్తిచేయండి

- నిలిచిన నిర్మాణాలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి -అనంతగిరి : అర్ధాంతరంగా నిలిచిపోయిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర హాస్టల్ భవనం నిర్మాణ పనులు తక్షణమే పున:ప్రారంభించి పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కమిటీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కార్యదర్శి ఎస్ నాగులు ఆధ్వర్యంలో సిపిఎం బృందం పునాదులతో మూడేళ్లుగా నిలిచి పోయిన హాస్టల్ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగులు, లోకారు సిపిఎం సర్పంచ్ కిల్లో మోసియా మాట్లాడుతూ విద్యార్థుల ఎన్నో పోరాటాలు చేస్తే గత ప్రభుత్వ హయాంలో హాస్టల్ భవన నిర్మాణాలకు 2 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ ప్రభుత్వం పునాదుల వరకు పనులు చేపట్టి, మూడేళ్లుగా పనులు నిలిపివేసిందన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో సరైన హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థిని విద్యార్థులు అద్దె గదుల్లో ఉంటూ చదువులు కొనసాగిస్తున్నారని, మరికొంతమంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, నిధులు విడుదల చేసి నిలిచిపోయిన పనులను పూర్తి చేసి హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీతేరి, కొండలరావు వంతల బుధ్ధయ్య జన్ని సుబ్బారావు పాల్గొన్నారు.


మేకలకు వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు

కొత్త బూరుగలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలానికి మారుమూల పినకోట పంచాయతీకొత్తబూరుగ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, పశువులు, మేకలకు వైద్య సేవలు అందించినట్లు కాశీపట్నం పశు వైద్యాధికారి డాక్టర్ సాగి గణేశ్వరరావు తెలిపారు. బూరుగ గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రాయపడ జలపాతంలో బోటు మార్గం ద్వారా చేరి, ఆక్కడ పశువుల వైద్యశిబిరం ఏర్పాటు చేసి 165 మేకలకు నట్టల నివారణమందులు వేశామన్నారు. అలాగే 112 పశువులకు జబ్బ వ్యాపు నిరోధక టీకాలు వేశామన్నారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించి, సీజన్‌లో మూగజీవాలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, పశునష్టానికి బీమా కార్డులను రైతులకు అందజేశాం. కార్యక్రమంలో చిన్నకోట జూనియర్ వెటర్నరీ అధికారిణి సుధారాణి సిబ్బంది పాల్గొన్నారు.

27న పుష్కరిణిలో పుణ్యహారతి

ప్రజాశక్తి-సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 27న తేదీన పుష్కరిణిలో పుణ్యస్నాన హారతి కార్యక్రమాన్ని జరిపేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆ రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకు కొండ దిగువన వెంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవమూర్తులను పల్లకిపై బయలుదేరి ఐదున్నర గంటలకు పుష్కరిణి వద్దకు చేరుకొని నక్షత్ర హారతి, కుంభ హారతిని సమర్పిస్తారు. ఈ కార్యక్రమం పాల్గొని దీపాలు వెలిగించాలని దేవస్థానం అధికారులు కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యల్లో అలసత్వం


దొడ్డి ప్రసాద్ చేపడుతున్న అక్రమ నిర్మాణం

యథేచ్ఛగా 1/70చట్టం ఉల్లంఘనలు
ఇష్టారాజ్యంగా గిరిజనేతరుల నిర్మాణాలు
చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
ఆదివాసీ గిరిజన సంఘం నేతల ఆందోళన

ప్రజాశక్తి- హుకుంపేట: మండలకేంద్రంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి, గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామారావు, కృష్ణారావు, డివిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, తడిగిరి సర్పంచ్ పెనుమాలి రంజిత్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో గిరిజనేతరుల అక్రమనిర్మాణాలపై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గడచిన రెండున్నరేళ్లలో 22శాశ్వత అక్రమ నిర్మాణాలు వెలిశాయని, వీటిపై గతంలో గిరిజన అఖిల పక్షల నాయకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టినా చర్యలేవన్నారు. అక్రమ నిర్మాణదారులతో అధికారులు కుదుర్చుకున్న లోపాయికారీ ఒప్పందం, ముడుపుల వ్యవహారం వల్లే అక్రమ నిర్మాణాలపై చర్యల్లో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. ఇకపై ఫిర్యాదులకు స్వస్తిపలికి, కలిసొచ్చే ఆదివాసీ సంఘాలతో ప్రత్యక్ష కార్యాచరణ, ఉద్యమాలకు సిద్ధమౌతామని హెచ్చరించారు. గిరిజనేతరుడైన ట్రైలర్ దొడ్డి ప్రసాద్ ఇప్పటికే 12దాకా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మరలా రెండు శాశ్వత షాపులు నిర్మిస్తున్నారన్నారు. రెవెన్యూ కార్యాలయం సమీపంలోనే బుద్దెకు కొండమ్మ అనే వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టిన కన్నెత్తి చూసే దిక్కు లేదన్నారు. రాళ్లగెడ్డ వద్ద ఈశ్వరరావు అనే గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- వ్యవసాయ సలహా మండలి సమీక్షలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
-పంట నష్ట పరిహారం చెల్లింపునకు అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి -పాడేరు : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, పశు సంవర్ధక శాఖ, చిన్న నీటి పారుదల, ప్రకృతి వ్యవసాయం, సెరికల్చర్, మత్స్యశాఖల కార్యక్రమాలపై సమీక్షించారు. సాగు విధానం, రైతులకు అందిస్తున్న వ్యవసాయ పథకాలు, రాయితీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి వలన రైతులకు పంట నష్టం జరిగిందని రైతులకు పంట నష్ట పరిహారం అందించడానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ చేశామని, ప్రకృతి సహకరించక పంట నష్టం జరిగిందన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం, రైతు భరోసా, పి.ఎం. కిసాన్ ప్రోత్సాహకాలు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. ఇ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలని ఆదేశించారు.. రాగులకు అందిస్తున్న మద్దతు ధరపై ఆరా తీసారు. కిలోకు రూ.38.46 పైసలు మద్దతరపై రైతు భరోసా కేంద్రాలలో ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు భరోసా, బ్యాంకు రుణాల వివరాలు తెలుసుకోవడానికి రైతులు బ్యాంకులకు వెళ్లాలని అన్నారు.
జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ ఉపకరణాల వివరాలపై రైతు భరోసా కేంద్రాలలో బోర్డులో వెల్లడించాలన్నారు. కాఫీ రైతులకు మిరియాల నర్సరీల పెంపకంపై శిక్షణ అందించాలన్నారు. .కాఫీ పళ్ల సరఫరా చేస్తున్న రైతులకు మాక్స్ సంస్థ సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్..సంద్, జిల్లా ఉద్యానవన అధికారి పి.రమేష్‌కుమార్ రావు, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు, ఎపిఎంఐపిపిడి రహీమ్, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, పౌర సరఫరాల డి.ఎం. బి.గణేష్, ఎపి సీడ్స్ డి.ఎం. నాగసాయి, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

బయోమెడికల్ డివైజ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) సంయుక్త నిర్వహణలో బయోమెడికల్ డివైజ్ హ్యాక్‌థాన్ (బయోమెడ్ భారత్-2024) నిర్వహిస్తున్నట్లు గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. దీనికి సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగం అవసరాలను గుర్తించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ హ్యాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలోని గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో ప్రస్తుతం పూర్తి కాలపు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు అభ్యసిస్తున్న వారు, పరిశోధక విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

నేరాలు ఘోరాలు


గంజాయి నిందితులతో పోలీసులు

పది కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్, మరొకరు పరారీ

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని మారుమూల లబ్బూరు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో బైక్‌పై తరలిస్తున్న పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.రవీంధ్ర తెలిపారు. మరో నిందితుడు పరారయ్యాడని వెల్లడించారు. ఎస్ఐ రవీంధ్ర తెలిపిన వివరాలివి... మండలంలోని లబ్బూరు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒడిశా పనసపుట్టు నుండి బుంగపుట్టు మీదుగా అపాచీ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వాహనతనిఖీలు చేస్తుండడాన్ని గమనించి, బైక్‌ను, బ్యాగ్‌ను విడిచిపెట్టి పారిపోతుండగా పోలీసులు వెంబడించి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా 10 కేజీల గంజాయి పట్టబడింది. ఇద్దరు నిందితుల నుంచి రూ.పది వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారించగా ఒకరు ఒడిశా కొరాపూర్ జిల్లా పొట్టంగి పంచాయతీకి చెందిన హిమాన్స్ శేఖర్‌గాను, మరొకరిని బిల్లాపుట్ పంచాయతీ గొడిపుట్ గ్రామానికి చెందిన మఠం సుశాంత్‌గా గుర్తించారు. పరారైన నిందితుడిని ఒడిశా మల్కన్‌గిరి జిల్లాకు చెందిన దినేష్‌గా గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పరారైన నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ రవీంధ్ర వెల్లడించారు. తనిఖీల్లో ఎఎస్ఐ తిరుపతి, కానిస్టేబుల్స్ రమేష్ ,సంజీవరావు, అర్జున్ పాల్గొన్నారు.

కెవిపి దృష్టికి గిరిజన సమస్యలు

ప్రజాశక్తి -హుకుంపేట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కెవిపి రామచంద్రరావు శుక్రవారం విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా అరకు పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సమిరెడ్డి బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని సమస్యలను కెవిపికి విన్నవించామన్నారు. నిరుద్యోగం, రైతుల సమస్యలతోపాటు విద్య, రహదారులు, తాగునీరు, వైద్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలపై రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గంప గోవిందు, పిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, తదితరులను కలిశామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి సీనియర్ నేత వంతల కృష్ణారావు, అల్లూరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ కూడా బాలకృష్ణ పాల్గొన్నారు.


కెవిపి రామచంద్ర రావును కలిసిన హుకుంపేట కాంగ్రెస్ నేతలు


డుంబ్రిగుడ మండలంలోని కండ్రుమ్‌లో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు

ఇచ్చిన హామీలను నెరవేర్చిన జగన్

ప్రజాశక్తి - కొయ్యూరు : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. మండలంలోని బంగారంపేట సచివాలయంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎంపిపితో పాటు వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్ పాల్గొని వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపిపి రమేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు మంచి చేస్తున్నట్లు చెప్పారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రీమల గంగాధర్, పాటి శేఖర్, స్థానిక సర్పంచ్ కురుజు పెంటమ్మ, వైస్ సర్పంచ్ శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ :మండలంలోని కండ్రుమ్ పంచాయతీ కేంద్రంలోని గురువారం పల్లెకు పోదాం, మా నమ్మకం నువ్వే జగన్ అన్న కార్యక్రమాన్ని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కిముడు హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ గిరిజనాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ కట్టుబడి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శెట్టి ఆనంద్, వైసిపి మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ బాధితులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోగల సింహాచలం తొలి పావంచా నుంచి అడివివరం జంక్షన్ వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో ఆస్తులు, భవనాలు కోల్పోయిన నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందించి న్యాయం చేస్తామని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం అయన భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జివిఎంసి టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు. బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ భాదితులతో కలిసి వాసుదేవ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. పూర్తిగా ఇల్లు కోల్పోయిన సుమారు 70 మందికి ఒక సెంట్ స్థలం చొప్పున ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని, ఖాళీ స్థలాలకు టిడిఆర్‌లు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం పలువురు బాధితులు మాట్లాడుతూ గోశాల నుండి అడవివరం వరకు రెండు వైపులా ఒకే మార్కెట్ విలువను నిర్ణయించాలని, కొంతమందికి పూర్తిగా వ్యాపారానికి సంబంధించిన ఆస్తులు పోయాయని, వారికి ఉపాధి మార్గాలను చూపాలని కోరారు. నష్ట పరిహార చెక్కులు అందరికీ వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరహాలక్ష్మి నరసింహం, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుధాకర్, రమణ మూర్తి పాల్గొన్నారు.

ఎయు ఇన్‌ఛార్జి విసిగా సమత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వ కళా పరిషత్ వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రస్తుత రెక్టార్ ఆచార్య కె.సమతను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పాఠశాలల్లో విధిగా ప్రమాణాలు పాటించాలి
స్కూల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరిక

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : బడి పిల్లల భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. అన్ని పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, సంబంధిత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన స్కూల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన బడి పిల్లల ఆటో ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదని కోరుకుంటున్నానన్నారు. బడికి వచ్చే పిల్లల ప్రయాణ సాధనాలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని, వారు ఇంటికి క్షేమంగా చేరుకునే వరకూ యాజమాన్యాలే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో చెప్పిన అన్ని విషయాలనూ పాఠశాల యాజమన్యాలు ఆచరించాలని, భవిష్యత్తులో తప్పులు జరిగితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, డిఇఒ చంద్రకళ తదితరులు

జిల్లా ప్రాముఖ్యత దృష్ట్యా చర్యలు

రానున్న రోజుల్లో విశాఖపట్నం జిల్లాకు ప్రాముఖ్యత చాలా పెరగనుందని, విద్యా సంస్థల నిర్వహణలో, ప్రమాణాలు పాటించడంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహ్లాదకరణమైన వాతావరణంలో పాఠశాలలను నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎత్తైన భవనాల పిట్ట గోడలను పటిష్టం చేయాలని, కావాలంటే ఎత్తు పెంచాలని చెప్పారు. విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చైల్డ్ ఫ్రెండ్లీ విధానాలు పాటించాలని, తరచూ అవగాహన శిబిరాలు పెట్టాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో తప్పకుండా డెంగీ కిట్లను అందుబాటులో ఉంచాలని, పాత భవనాలు ఉంటే తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. డిసిపి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, అందరూ భాగస్వామ్యం వహించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ప్రతి ఒక్కరూ జీవితం విలువ తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం, అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, ఎడిసిపి జి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ ఉప సంచాలకులు వెంకటేశ్వరి, ఎసిపి డి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డిఎఫ్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్, డిటిసి, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

బొగ్గు లారీని ఢీకొన్న ఫార్మా బస్సు

ఒకరు మృతి - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ, లంకెలపాలెం మెయిన్ రోడ్డులో రాంకీ ఫైర్ స్టేషన్ సమీపాన శుక్రవారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పార్కింగ్ చేసిన బొగ్గులారీని ఓ ఫార్మా కంపెనీకి చెందిన కంఫర్ట్ ట్రావెల్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అచ్యుతాపురం లారస్ కంపెనీకి ఉదయం ఆరు గంటల షిఫ్ట్ డ్యూటీకి వెళ్తున్న కార్మికుడు ఎస్.నాగ వెంకటేష్ (30) అక్కడికక్కడే మృతి చెందారు. షిఫ్ట్ ఇన్‌ఛార్జి గంగాధర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. జి.వెంకటరావు, ఎం.చెన్నారావు, కె.గణపతి తదితరులూ గాయపడ్డారు. వీరు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ట్రావెల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అతివేగంగా వాహనాలు నడపడం, ఒకే డ్రైవర్‌తో అనేక డ్యూటీలు చేయించడం, పని ఒత్తిడి వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బొగ్గు లారీలను ఈ మార్గంలో ఎక్కడబడితే అక్కడ రాంగ్ పార్కింగ్ చేస్తున్నారన్నారు.


గాయపడ్డ కార్మికున్ని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి

ఆర్నెళ్లుగా ఇవ్వని కందిపప్పు

- సరఫరాకు చర్యలు చేపట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : బియ్యం కార్డులకు ఆర్నెళ్లుగా కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేయడంలేదు. దీంతో అధిక ధర పెట్టి మార్కెట్‌లో కొనలేక పేదలు అత్యధిక మంది కందిపప్పు వంట మానేశారు. గతంలో రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా రూ.67కు కిలో కందిపప్పును లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేసేది. మార్కెట్లో దీని ధర కనీసంగా రూ.130 నుంచి రూ.200 వరకూ వుండడంతో పాత ధరకు సరఫరా చేయలేక గుత్తేదారులు చేతులెత్తేశారు. పెరిగిన ధరకు అనుగుణంగా టెండర్లు పిలిచి ధర నిర్ణయించి సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదు. దీంతో పాత ధరకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. పేదలకు ఈ ఏడాది జూన్ నుంచి నవంబరు వరకు అందలేదు. ఆగస్టు రేషన్‌తో కలిపి జూన్, జులై నెలల కందిపప్పు పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ కందిపప్పు ఇవ్వడంలేదు. జిల్లాలో 5.47 లక్షల బియ్యం కార్డులున్నాయి. ఈ కార్డుల ప్రకారం ప్రతి నెలా 540 మెట్రిక్ టన్నులు కేటాయించాల్సివుంది. ప్రభుత్వ నిర్దేశిత ధర రూ.67 ప్రకారం నెలకు రూ.3.66 కోట్ల విలువైన కందిపప్పు లబ్ధిదారులకు అందాల్సివుంది. ఆర్నెళ్లుగా సరఫరా చేయకపోవడంతో రూ.21.96 కోట్లు ఆదా అయిందన్న ఆలోచనతో వున్నట్లు కనబడుతోంది తప్ప పేదలకు ఇవ్వాల్సిన కందిపప్పు ఇవ్వలేదన్న చింత ఏ మూలా ప్రభుత్వంలో లేదు. అయితే డిసెంబరు నుంచి రేషన్‌తో పాటు కేజీ కందిపప్పు ప్రభుత్వం సరఫరా చేయనుందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. ఒకవేళ సరఫరాను పునరుద్ధరించినా లబ్ధిదారులందరికీ సరఫరా చేసేలా ప్రభుత్వ చర్యలు ఏ కోశానా కనబడ్డంలేదు.

బిసిల బతుకులతో చెలగాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిసిల బతుకులతో చెలగాటం ఆడుతున్న జగన్ మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేసేలా కలిసి పనిచేస్తామని పలువురు బిసి నేతలు అన్నారు. శుక్రవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'బిసిలకు ప్రభుత్వ నమ్మక ద్రోహంపై ఐక్య పోరాటం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన విశాఖ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అనసూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు జనగణన పేరుతో బిసిలను వంచించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి చట్టబద్ధతా లేకుండా వాలంటీర్లతో జనగణన చేయడం నమ్మక ద్రోహం కాక మరేంటని ప్రశ్నించారు. విశాఖను రాజధానిగా చెబుతూ ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ బిసిలకు చెందిన 75 వేల కోట్లను దారి మళ్లించి, రిజర్వేషన్‌ను కుదించి బిసిలను దగా చేయడమే జగన్ చెప్పే బిసి సంక్షేమమా ? అన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిసి సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ, బిసి సంఘాల నాయకులు అంగటి రాంబాబు, అప్పలరాజు, వెంకట్, రామచంద్రరావు, తాతారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌ల ఆప్తుడు యార్లగడ్డ

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌లకు అత్యంత ఆప్తులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అని సినీ హీరో నాగార్జున అన్నారు. సిరిపురం వాల్తేరు క్లబ్బులో సప్తతి ఒక లిప్తగా పేరిట పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ 70 వసంతాల వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్య, సినిమా, సాహిత్య, రాజకీయ రంగ ప్రముఖులు సమక్షంలో ఈ వేడుకలు నిర్వహించారు. అతిథిగా హాజరైన హీరో నాగార్జున మాట్లాడుతూ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ స్నేహ శీలి అని కొనియాడారు. ఆయన్ను తనకు తన తండ్రి పరిచయం చేశారన్నారు. సలహాలు అవసరమైనప్పుడు తాను యార్లగడ్డకు ఫోన్ చేస్తుంటానన్నారు. మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ యార్లగడ్డ అందరివాడు అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా లోక్ నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ నల్లా బాబయ్యకు హీరో నాగార్జున చేతుల మీదుగా రూ.50 లక్షల విరాళం అందించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సినీ దర్శకుడు కె.రాఘవేంద్ర రావు, హీరో అఖిల్, నటుడు తనికెళ్ల భరణి, నటి రోజా రమణి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, కె.రామ్మోహన నాయుడు, మాజీ ఎంపీలు కెవిపి.రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు